క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై దృష్టిసారించాలి


కూలర్‌లో నిల్వ నీటిని పారబోస్తున్న సిబ్బంది

కుంటాల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని ఎంపీడీవో అల్లాడి వనజ సూచించారు. మంగళవారం డ్రైడే సందర్భంగా కుంటాలలో ఇంటింటా తిరిగి అవగాహన కల్పించారు. కార్యక్రమంలోఎంపీవో ఎంఏ రహీంఖాన్, పంచాయతీ కార్యదర్శి రాజబాపు, ఏఎస్ఎం సుచరిత, ఆశ వర్కర్ విజయ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం


పాల్గొన్న దంపతులు

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామ శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం చండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. పండితుడు భగవాన్ జోషి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

లోకేశ్వరం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో వెంకటరమేశ్ పేర్కొన్నారు. మండలంలోని మన్మద్ గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. కార్యదర్శులు ఈ పనులను పర్యవేక్షించాలన్నారు. గ్రా మాల్లో వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. మురుగుకాల్వలను శుభ్రం చేయాలని సూచించారు. కార్యదర్శులు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆయన వెంట కార్యదర్శి ఉన్నారు.

నేడు అభివృద్ధి పనులకు భూమిపూజ

దిలావర్‌పూర్: మండలకేంద్రంతోపాటు సిర్గాపూర్, దిలావర్‌పూర్‌తండాలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బుధవారం అభివృద్ధి పనులకు భూమిపూజ చేయనున్నారు. ఉదయం 10 గంటలకు సిర్గాపూర్ పీడబ్ల్యూబీ రోడ్డు నుంచి వయా కాల్వతండా నుంచి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం వరకు రూ.1.91 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు ప్రారంభించనున్నారు. దిలావర్‌పూర్‌లో గురడికాపు సంఘంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. స్థానికంగా నిర్మించ తలపెట్టిన ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు. అనంతరం దిలావర్‌పూర్ తండా నుంచి బన్నపల్లి వరకు రూ.2.56 కోట్లతో చేపట్టే బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

భైంసాటౌన్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుమలత ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 31న స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ ఉంటుందని, ఆసక్తిగల విద్యార్థినులు మార్చి 2025 పదో తరగతి మెమో, టీసీ, బోనాఫైడ్, కుల, ఆదాయ, జనన ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో సంప్రదించాలన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్ అనంతరం రిజర్వేషన్, మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు.
సోన్: మండలంలోని లెఫ్ట్ పోచంపాడులో సాంఘిక సంక్షేమ గురుకులాల బాలికల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో హెచ్ఈసీ, సీఈసీ గ్రూప్‌ల్లో స్పాట్ అడ్మిషన్ కోసం 31న కౌన్సెలింగ్ ఉంటుందని ప్రిన్సిపాల్ ఆర్.ప్రశాంతి ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు 8985850279 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.
తానూరు(ముధోల్): ముధోల్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీలో స్పాట్ అడ్మిషన్ కోసం 31న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో 13, బైపీసీలో 26 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు.

రెయిన్‌కోట్లు పంపిణీ

ఖానాపూర్: మున్సిపల్ కార్యాలయంలోని 20 మంది కార్మికులకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు వాల్గోట్ కిషన్ తన సొంత డబ్బులతో కొనుగోలు చేసిన రెయిన్‌కోట్లను మంగళవారం పంపిణీచేశారు. మున్సిపల్ కమిషనర్ సుందర్‌సింగ్‌తో వీటిని అందించారు. ఉపాధ్యాయుడు కిషన్‌ను అభినందించారు.


పూజల్లో ఎమ్మెల్యే రామారావు పటేల్


భైంసా మండలం సుంక్లిలో క్యూలో భక్తులు


కుంటాల: కల్లూరులో పుట్ట వద్ద..


ఖానాపూర్: జంగల్‌హన్మాన్ ఆలయం వద్ద..

నాగమ్మా..దీవించు

భైంసాటౌన్/భైంసారూరల్/తానూరు/కుంటాల/కడెం/లక్ష్మణచాంద/సోన్/బాసర/కుభీర్/దిలావర్‌పూర్/ఖానాపూర్/దస్తురాబాద్: జిల్లాలో నాగుల పంచమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉదయం నాగదేవత ఆలయాలకు వెళ్లారు. పుట్టల్లో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జొన్న పేలాలు, పుట్నాలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భైంసాలోని మాంజ్రి మార్గంలోని నాగదేవత ఆలయంలో ఎమ్మెల్యే రామారావు పటేల్ పూజలు చేశారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని పూజలు నిర్వహించారు. మహిళలు తోబుట్టువుల కాళ్లు కడిగి వారు ఇచ్చే కానుకలు స్వీకరించారు. గిరిజన తండాల్లో చెట్లకు ఊయాల కట్టి ఊగారు.


భైంసాటౌన్: పద్మావతి కాలనీలో..


సోన్ మండలం న్యూబొప్పారం గ్రామంలో పాము పుట్టలో పాలు పోస్తున్న మహిళలు


బాసరలో పుట్టలలో నాగదేవతకు పాలు పోస్తున్న భక్తులు


పుట్టలో పాలు పోస్తున్న భక్తులు


జిల్లా కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయంలో..


కుంటాల: సూర్యాపూర్‌లో పుట్టలో పాలు పోస్తూ..


కడెంలో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు


లక్ష్మణచాంద: పుట్ట వద్ద పూజలు చేస్తూ..


కుభీర్‌లో నాగదేవత విగ్రహానికి పూజలు చేస్తూ..


గోడిసేర్యాలలో నాగ ప్రతిమతో ఊరేగింపు

రేషన్‌కార్డులతో పేదలకు మేలు


రేషన్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ అభిలాష అభినవ్


కుభీర్‌లో రేషన్ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద: నూతన రేషన్‌కార్డుల పంపిణీతో పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరిందని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి మంగళవారం లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రేషన్ కార్డుతోనే ప్రభుత్వ పథకాలు ముడిపడి ఉన్నాయని తెలిపారు. కార్డుల కోసం ప్రజలు దరఖాస్తులు చేసుకున్న వెంటనే అధికారులు పరిశీలించి మంజూరు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ కార్డులతో ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ తదితర పథకాలకు అర్హత లభిస్తుందన్నారు. రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం పేదలకు నాణ్యమైన సన్నబియ్యాన్ని అందిస్తోందన్నారు. మండలానికి సంబంధించి 613 నూతన రేషన్ కార్డులు మంజూరు కాగా, 1517 కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు అదనంగా చేర్పినట్లు వెల్లడించారు. ఆదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, పౌరసరఫరాల అధికారి రాజేందర్, మండల ప్రత్యేకాధికారి అంబాజీ, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో రాధారాథోడ్, నిర్మల్ వ్యవసాయ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు చిన్నయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

కుభీర్: తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే పి.రామారావ్ పటేల్ మంగళవారం లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అన్నారు. సన్నబియ్యం ఒకరికి 6 కిలోలు ఇస్తుండగా అందులో 5 కిలోల కేంద్రప్రభుత్వం ఇస్తోందని తెలిపారు. మండలంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానన్నారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా దార్‌కుభీర్ గ్రామంలో రూ.29 లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. మండల ప్రత్యేక అధికారి శంకర్, తహసీల్దార్ శివరాజ్, ఎంపీడీవో సాగర్‌రెడ్డి, ఎంఈవో విజయ్‌కుమార్, ఏఈ మహేశ్, మార్కెట్ చైర్మన్ కళ్యాణ్, నాయకులు నాగేశ్, దత్తాత్రి, మారుతి, సాయినాథ్ తదితరులు ఉన్నారు.

సమస్యల్లో మాటేగాం

- శిథిలదశలో పంచాయతీ భవనం
- రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్


శిథిలావస్థలో మాటేగాం పంచాయతీ

భైంసారూరల్: 61వ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న మాటేగాం గ్రామం సమస్యల్లో కొట్టుమిట్టాడుతోంది. స్థానికంగా నిధులు మంజూరైతే అభివృద్ధి పనులు జరుగుతాయి. గత కొన్నేళ్లుగా స్థానికులు సమస్యలతోనే సతమతమవుతున్నారు. 61వ జాతీయ రహదారి నుంచి అర కిలోమీటర్ దూరంలో ఉన్న ఈ గ్రామంలో అపరిష్కృత సమస్యలు ఉన్నాయి. గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరింది. కూలడానికి సిద్ధంగా ఉన్న భవనం పరిస్థితి తెలిసినా కొత్తగా నిర్మించడం లేదు. గ్రామ పంచాయతీకి సంబంధించిన సమావేశాలన్నీ ఇక్కడే నిర్వహిస్తారు. పైగా గ్రామ రెవెన్యూ, పంచాయతీ రికార్డులు సైతం ఇక్కడే ఉన్నాయి. గ్రామంలో ఏ అవసరం ఉన్నా అధికారులు పంచాయతీ భవనానికి వచ్చి అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తుంటారు. గ్రామ పంచాయతీ భవనమే శిథిలదశకు చేరిన ఎవరూ పట్టించుకోవడం లేదు.

గ్రామం మధ్యన..

61వ జాతీయ రహదారి నుంచి వెళ్తే ముందుగా రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్ కనిపిస్తుంది. తక్కువ ఎత్తులో జనావాసాల మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై ఇప్పటికే పశువులు విద్యుత్ షాక్‌తో మృతిచెందాయి. ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు పెంచి చుట్టూ రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. అయినా అధికారులు ఇప్పటికి స్పందించడం లేదు.

అధ్వాన రోడ్డు

గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. కంకరతేలిన రోడ్డుపై ఇబ్బంది పడుతున్నారు. వేసవిలో వాహనాలు వెళ్తే వెనుక నుంచి దుమ్ము కప్పేస్తుంది. గ్రామానికి వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు స్పందించి సకాలంలో రోడ్డు నిర్మిస్తే సమస్యలు తీరుతాయని గ్రామస్తులు కోరుతున్నారు.

అభివృద్ధిపై దృష్టిసారించాలి

గ్రామ అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. సమస్యలతో ఉన్న గ్రామానికి నిధులు ఇవ్వాలి. చాలా చోట్ల రోడ్లు గుంతలుగా మారాయి. అధ్వాన రోడ్లకు వెంటనే మరమ్మతు చేపట్టాలి.
– అనిల్, గ్రామస్తుడు

రోజూ తిప్పలు పడుతున్నాం

గ్రామ సమస్యలతో రోజూ తిప్పలు పడుతున్నాం. గ్రామం నడి మధ్యన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ ఏర్పాటు చేయలేదు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో రక్షణ ఏర్పాట్లు చేయాలి. డ్రెయినేజీలు చాలాచోట్ల దెబ్బతిన్నాయి. మరమ్మతుపై అధికారులు దృష్టిపెట్టాలి. – విజయ్, గ్రామస్తుడు

కాంగ్రెస్‌తోనే గ్రామీణాభివృద్ధి


మాట్లాడుతున్న సుభాష్ యాకరన్

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామీణాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆర్జీపీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి సుభాష్ యాకరన్ అన్నారు. జిల్లా కేంద్రంలో రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. నిర్మల్, ముథోల్ నియోజకవర్గ ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతదేశ పంచాయతీరాజ్ వ్యవస్థ, అధికార వికేంద్రీకరణకు రూపశిల్పి రాజీవ్‌గాంధీ అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ప్రజాప్రతినిధుల విలువను, స్థానిక సంస్థలకు రాజ్యాంగపరంగా హక్కులు కల్పించిందని తెలిపారు. గ్రామస్థాయి నుంచి నాయకులుగా కార్యకర్తలు ఎదగాలన్నారు. కార్యక్రమంలో ముథోల్ నియోజకవర్గ, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్, నిర్మల్ మాజీ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, నాందేడపు చిన్ను, అబ్దుల్ హాది, సాధ సుదర్శన్, రామేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, కేశం రమేశ్, వాజిద్ అహ్మద్‌ఖాన్, కుంట వేణుగోపాల్, సాగర్‌రెడ్డి, పాల్దే అనిల్, బొల్లోజి నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మొయినుద్దీన్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

తానూరు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా ఉపవైద్యాధికారి ఆకాశ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రోగుల వివరాలు, టీకా కార్యక్రమాలు, మందుల పంపిణీకి సంబంధించిన వివరాలను డాక్టర్ అజిత్‌ను అడిగి తెలుసుకున్నారు. మెడిసిన్ స్టోర్‌లో నిల్వ ఉన్న మందులను పరిశీలించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేయాలని సిబ్బందికి సూచించారు.

అడవుల సమతుల్యతతో పులుల సంరక్షణ

ఖానాపూర్: జీవ వైవిధ్యంలో పులుల పాత్ర కీలకమైనదని, అడవుల సమతుల్యతతోనే పులుల సంరక్షణ సాధ్యమవుతుందని ఖానాపూర్ ఎఫ్‌డీవో ఏ.శివకుమార్ అన్నారు. అంతర్జాతీయ పులుల సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంతోపాటు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ప్రధాన వీధులగుండా అటవీ అధికారులు, సిబ్బందితో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఎఫ్ఆర్‌వో కిరణ్, తదితరులు ఉన్నారు.

వర్షం.. హర్షం

- చిరు జల్లులతో మొదలైన పంచమి

భైంసా: నాగుల పంచమి చిరు జల్లులతో మొదలైంది. జిల్లాలో మంగళవారం వేకువజామున మొదలైన చిరుజల్లులు.. రాత్రి వరకు కొనసాగాయి. వానాకాలం మొదలైనప్పటికీ మధ్యలో వర్షాలు తగ్గడంతో రైతులు ఆందోళన చెందారు. వారం నుంచి మళ్లీ కురుస్తున్న వర్షాలు రైతుల్లో ఆనందం నింపాయి. ఈ వర్షాలు సోయా, పత్తి పంటలకు ప్రాణం పోశాయి.

మండలం	వర్షపాతం (మి.మీలో)
సారంగాపూర్	22.4
భైంసా	10.4
కుంటాల	7.4
దిలావర్‌పూర్	7.2
కుభీర్	6.8
నర్సాపూర్(జి)	6.0
నిర్మల్	4.8
లోకేశ్వరం	4.2
కడెం	4.2
సోన్	3.6
పెంబి	3.6
నిర్మల్‌రూరల్	3.2
ఖానాపూర్	1.8
దస్తూరాబాద్	1.0
మామడ	0.8

గోదావరికి వరద

మహారాష్ట్రలో వర్షాలతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 65 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో ప్రాజెక్టులో నీరు 36 టీఎంసీలకు చేరింది. కడెం, స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టుల్లోకి వరద వస్తోంది. చెరువులు, కుంటలు నిండుతున్నాయి. వాగులు పారుతున్నాయి.

ఊపందుకున్న వరినాట్లు

వర్షాలతో సిరాల, ఇలేగాం, సారంగాపూర్ తదితర ప్రాంతాల్లో వరినాట్లు ఊపందుకున్నాయి. బోరుబావులతోపాటు వర్షం తోడవడంతో రైతులు ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం

జిల్లా వ్యాప్తంగా 87.4 మి.మీల సగటు వర్షపాతం నమోదైంది. సారంగాపూర్‌లో అత్యధికంగా 22.4 మి.మీలు, మామడలో అత్యల్పంగా 0.8 మిల్లీమీటర్ వర్షపాతం నమోదైంది.

అంగన్‌వాడీల హక్కుల కోసం పోరాటాలు


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: అంగన్‌వాడీల హక్కుల సాధనకు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకత్వంలో అనేక సమరశీల పోరాటాలు చేశామని, భవిష్యత్‌లో చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లలిత తెలిపారు. యూనియన్ కార్యాలయంలో మంగళవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ ఫేస్ క్యాప్చర్ విధానంతో నెట్ కవరేజ్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వెంటనే ఈ విధానం రద్దు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద, లావణ్య, రమ్య, జిల్లా సహాయ కార్యదర్శులు భాగ్య, విజయ మునీంద్ర, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

మామడ: కొరిటికల్‌లో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. పండితులు రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఐకేరెడ్డి, బీఆర్ఎస్ ఇన్‌చార్జి రాంకిషన్‌రెడ్డిలు వేర్వేరుగా స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అంతకుముందు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. తర్వాత స్వామివారి రథోత్సవం చేపట్టారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

సంక్షిప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన ఇలేగాం వీడీసీ సభ్యులు

భైంసాటౌన్: మండలంలోని ఇలేగాం వీడీసీ సభ్యులు ఎమ్మెల్యే పి.రామారావు పటేల్‌ను పట్టణంలోని ఆయన నివాసంలో మంగళవారం కలిశారు. గ్రామంలో సిరాల ప్రాజెక్టు పూర్తి కావడంతో ఈమేరకు ఆయన్ను కలిసి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.9 కోట్ల నిధులు మంజూరు చేయించడంతోపాటు అధికారులను పరుగులు పెట్టించి, పనులు త్వరగా పూర్తి చేసేలా చొరవ చూపారన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధికి సహకరిస్తానన్నారు.

నేడు రేషన్‌కార్డుల పంపిణీ

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని దివ్యగార్డెన్ ప్రాంగణంలో బుధవారం కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్డీవో రత్నాకళ్యాణి ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ అభిలాష అభినవ్ హాజరై లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.
భైంసాటౌన్: పట్టణంలోని సురలోక్ గార్డెన్‌లో బుధవారం రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్డీవో కోమల్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కార్డులు అందించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు.

నేడు సదర్మాట్‌కు నీటి విడుదల

ఖానాపూర్: మేడంపల్లిలోని సదర్మాట్ వద్ద ఆయకట్టు రైతుల వానాకాలం పంటల సాగుకోసం మంగళవారం స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు.. నీటి విడుదల చేయనున్నారు. అనంతరం సత్తన్‌పల్లి రైతువేదికలో రేషన్‌కార్డుల పంపిణీ చేస్తారని తహసీల్దార్ సుజాత తెలిపారు.

న్యూసాంగ్విలో వైద్యశిబిరం

మామడ: న్యూసాంగ్విలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. 44 మందికి సాధారణ చికిత్స అందించి ఇద్దరు జ్వర బాధితుల నుంచి రక్త నమూనాలను వైద్యసిబ్బంది సేకరించారు. ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, ఏఎస్ఎం ఇందిరా, వీక్షణ, పంచాయతీ కార్యదర్శి అనసూయ ఉన్నారు. కాగా, మామడ పీహెచ్‌సీని ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి అశిష్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. వైద్యులు స్వాతి, మౌనిక, సిబ్బంది ఉన్నారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన

ఖానాపూర్: బాదన్‌కుర్తి పంచాయతీ పరిధి చింతల్‌పేట్ రైతు వేదికలో మంగళవారం ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యానశాఖ అధికారి ఎం.స్పందన , ఏఈవో చందన ఉన్నారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న అంజిప్రసాద్

దస్తురాబాద్: రైతులు నానో ఎరువుల వైపు దృష్టి సారించాలని డీఏవో అంజిప్రసాద్ సూచించారు. మండలంలోని మల్లాపూర్, మున్యాల,రేవోజీపేట,దస్తురాబాద్ గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులను మంగళవారం తనిఖీ చేశారు. యూరియా, డీఏపీ స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. తహసీల్దార్ విశ్వంబర్, డిప్యూటి తహసీల్దార్ యాదవరావ్, సీనియర్ అసిస్టెంట్ సంతోష్, ఏఈవోలు తిరుపతి, కిరణ్ ఉన్నారు.

ఫిజియోథెరపీపై అవగాహన

తానూరు: ఎంఈవో కార్యాలయంలో మండలంలోని ఆయా పాఠశాల ఉపాధ్యాయులకు ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు. బ్యాక్‌పెయిన్ ఎలా తగ్గించుకోవచ్చని హైదారాబాద్ నిమాజ్ ఫిజియోథెరపీ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యుడు సంతోష్ వివరించారు. ఎంఈవో నరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.